


# మనసుగతి ఇంతే

## ఎ. అన్నపూర్ణ

"భారతీ

ఎలా ఉన్నావ్? రామచంద్రం చనిపోయినట్టు తెలిసింది. అందుకే కొంచెం ఖాళీ చేసుకుని ఈ ఉత్తరం రాస్తున్నాను. ఈ మధ్య నువ్వూ, నేనూ కూడా చాలా బిజీ అయిపోయాం. మనం విడిపోయే ముందు ఎన్ని అనుకున్నా, ఆచరణలో సాధ్యం కావడంలేదు. కారణాలంటూ చెప్పుకోడానికి చాలానే ఉన్నాయి. కానీ ఈ కబురు తెలిశాక వెంటనే రాస్తున్నాను.

త్వరలో నేను ఇండియా వచ్చే ఆలోచన వుంది. అప్పుడు కలుసుకుని వివరంగా మాట్లాడుకుందాం! నీకు నా సానుభూతి. పిల్లలను అడిగానని చెప్పు.

జయంతి" ఉత్తరం మడిచి కవర్లో పెట్టి డ్రాయర్ సొరుగులో పడేసింది భారతి.

జయంతి, తను డిగ్రీలో క్లాస్‌మేట్స్. జయంతి నాన్నగారు గవర్నమెంట్ ఎంప్లాయి కావడంతో మూడేళ్ళు మాత్రమే కలిసి చదివారు.

ఆ తర్వాత వాళ్ళు విశాఖపట్నం వెళ్ళిపోయారు. తనకి నాన్నగారు పెళ్ళి చేసి అత్తారింటికి పంపించేశారు. జయంతి ఎం.ఎస్.సి., పి.హెచ్.డి. చేశాక, తనకిష్టమైన అబ్బాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళిపోయింది.

....తనకి మేనత్త కొడుకే భర్త అయినా, ఏమిటో అతని పద్ధతులు వేరు. తన ఆలోచనలు వేరూను. నాన్నగారు 'అక్కకి మాట ఇచ్చాను, మేనరికం చేసుకుంటానని' అంటూ సెంటిమెంటుతో చాలా సునాయాసంగా పెళ్ళి చేశారు. కానీ లా యూనివర్శిటీలో చదవాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలని ఎన్నో అనుకునేదాన్ని. కాని నాన్నగారంటే భయంతో, తలవంచాల్సి వచ్చింది.

పోనీ నా జీవితం సుఖప్రదంగా సాగివుంటే, నేను చదువుకోలేకపోయానని, దిగులు వుండేది కాదేమో!... అసంతృప్తితో పెళ్ళికి తలవంచిన నేను, ఇప్పటివరకూ అలాగే బ్రతికాను.

జయంతికి అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తూ, నా గురించి చెప్పినప్పుడు తనేమీ కామెంట్ చేయలేదు. నన్ను సమర్థించనూ లేదు. "రామచంద్రాన్ని చేసుకోవడం ఇష్టం లేదా? పెళ్ళి ఇష్టం లేదా?" అని అడిగింది.

"రెండూనూ" అంటే "మీ అమ్మగారితో చెప్పు" అన్నది.

"అంత ధైర్యం ఆవిడకే లేదు. చెప్పినా ప్రయోజనం లేదు" అన్నాను. అంతే మరి మాట్లాడలేదు.

ఎవరు మాత్రం ఏం చెబుతారు? రామచంద్రం దురలవాట్ల పుట్ట. బాధ్యత

పట్టించుకునేవాడు కాదు. పిల్లలకు కూడా నా మీద గౌరవం లేకుండా చేశాడు. పిల్లలిద్దరూ తండ్రి చెప్పినట్లే వినేవారు. భార్య అంటే ఎంతసేపూ భర్తకి దాసోహం చేయాలి. భర్త అనుమతి లేనిదే పది రూపాయలు ఖర్చు చేయరాదు. చేయవలసి వస్తే ముందుగా చెప్పాలి. తన పని తనూ ఏనాడూ చేసుకోలేదు.

అన్నింటికీ "భారతీ... భారతీ...! అదిలా తీసుకురా... ఈ పని వెంటనే ఎందుకు చేయలేదు? మేం వెళ్ళిపోయాక ఖాళీగానే వుంటావుగా...! ఏం చేశావ్...?" అంటూ పరుగులు పెట్టిస్తాడు.

పొరబాటున ఏదైనా పాడైతే సాధింపుకి అంతు ఉండదు. అతనితో జీవితం కత్తిమీద సాములా సాగేది. అలా నా జీవితంలో ముప్పై సంవత్సరాలు ఏ మధురానుభూతి లేకుండా యాంత్రికంగా గడిచిపోయాయి.

అతడి వ్యసనాలకు లివర్‌పాడై, ఈ మధ్యనే ఈ లోకం విడిచి వెళ్ళిపోయాడు. నాన్న నా అసంతృప్తి గ్రహించాడు. అల్లుడి నిర్వాకమూ తెలుసుకున్నాడు. "మేనల్లుడనే అభిమానంతో నీ గొంతు కోశాను తల్లీ!" అంటూ విలపించాడు.

ఆయన బాధ చూడలేక "మీ తప్పు ఏమీ లేదు నాన్నా! నేనే అతడితో అడ్జస్ట్ కాలేకపోయాను..." అన్నాను ఆయనను మభ్య పెట్టడానికి.

"కాదమ్మా! నాకు అర్థమయింది..." అంటూ కొడుకులతో పాటు ముందుచూపుతో ఆస్తి పంచి ఇచ్చాడు. ఓ సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్ కొనిచ్చాడు.

ఆయన చేసిన ఉపకారం ఇదే! జయంతితో తన మనసు విప్పి చెప్పింది భారతి.

మరి నీ కొడుకులు...?

"జయంతీ! నీకు చెప్పానుగా, వాళ్ళు ముమ్మూర్తులా తండ్రి పోలిక. వాళ్ళ దగ్గరకు రమ్మని అడిగారు. ససేమిరా రానని చెప్పేశాను. నా అన్నదమ్ములు శాస్త్రం, ధర్మం అంటూ తీసుకువెడతామని వచ్చారు. ఏ శాస్త్రం, ధర్మం పాటించడం లాంటి నమ్మకాలు నాకు లేవు. నన్నిలా ఒంటరిగా బ్రతకనీయండి... అదే పది వేలు" అన్నాను. "నీ ఇష్టం! ఏదో కష్టంలో ఉన్నావు. పది రోజులు అటూ యిటూ వస్తే మరపుకి పడుతుంది నీ బాధ..." అంటూ వదిన, మరదళ్ళు అనునయించాలని చూశారు. కాదు పొమ్మని పంపించివేశాను..." అన్నది భారతి.

"నీకీ తెగింపు ఎలా వచ్చిందే భారతీ...!" అన్నది జయంతి.

"ఇప్పుడు నన్ను శాసించే వాళ్ళు ఎవరు జయంతీ? నిజానికి నాకు ఎవరి మీదా కోపం లేదు. ఒకరి ఆసరా అవసరం లేదు. తీరిగ్గా హాయిగా కంటి నిండి నిద్రపోయి ఎంత కాలమైందో తెలుసా? నా కోసం నేనుగా మిగలాలనీ, ఈ జీవితం నా స్వంతమనీ, నా బాల్యం నుంచి మనం కాలేజీలో చదువుకునే రోజుల వరకూ, చర్విత చరణం చేసుకోవాలని ఎంతగా అనిపించేదో... అసలు పెళ్ళి చేసుకోవడం వలన ఎన్ని కోల్పోయానో...?"

"భారతీ! ఒక్క విషయం అడుగుతాను చెప్పు! మనిద్దరం స్నేహితులం. అయినా నీలో ఏదో రహస్యం దాచుకున్నావనీ, అందుకే రామచంద్రం పట్ల విముఖత, అయిష్టం కలిగాయనీ నేను అనుకున్నాను. నిజమేనా?"

జయంతి చేతిని ఆప్యాయంగా నిమురుతూ... "ఈ ప్రశ్న ఇంత ఆలస్యంగా అడిగావేమిటి జయంతీ...?" అన్నది భారతి.

"అది నిజమో.. కాదో...? అది నిజం కాకపోతే సున్నితమైన నీ మనసును గాయం చేసిన దాన్ని అవుతానేమో... అనే సందేహంతో..."

"తెలిస్తే ఏం చేసేదానివి?"

"నా చేతనైనంతగా సహాయం చేసేదాన్ని!"

"లేదు జయంతీ! నువ్వేమీ చేయలేవు. అందుకే నాలోనే దాచుకున్నాను..."

"పోనీ ఇప్పుడైనా చేయగలనేమో...?"

"లేదు. నేను కోరుకోవడం లేదు. నాకు లోన్లీగా వుండటమే ఇష్టం. అదే కోరుకుంటున్నాను. నాకిప్పుడు ఎంత స్వేచ్ఛ...!"

"అదొక్కటే చాలా?"

"ఆ... చాలు...! నా అనుభవంలో ఇదొక్కటే చాలు".

"ఎప్పుడూ ఇలాగే వుండిపోవుగా. వృద్ధాప్యం, అనారోగ్యం..?"

ఇవన్నీ చెప్పి, భారతిని భయపెట్టకూడదు. తను కోరుకునే జీవితం లభించిందన్న తృప్తిలో వృద్ధాప్యం, అనారోగ్యం ఆమె దరికి చేరనే కూడదు.

నాలుగు రోజుల తర్వాత ప్రయాణం అవుతూ...

"భారతీ! నాకిప్పుడు నీలోని ఆత్మస్థైర్యాన్ని చూశాక, చాలా ఆనందంగా వుంది. జరిగింది మరిచి, నువ్వు కోరుకున్నట్టుండు. ఉత్తరాలు రాయడం మర్చిపోకు. వెళ్ళి వస్తాను మరి" అన్నది జయంతి.

ఇది వరకు ఎందుకు ఉత్తరాలు రాయలేదో తెలుసు. పదిహేను రూపాయలు ఖర్చుచేయగల స్వాతంత్ర్యం అప్పుడు లేదు. ఇప్పుడు రాయగలదనీ తెలుసు, రాస్తుందనీ తెలుసు. తృప్తితో బయలుదేరింది జయంతి.

వినేవాళ్ళకి చేదుగా ఉంటుందేమో కానీ, రామచంద్రం లాంటి భర్త మరణించినందుకు భార్యలు ఏనాడూ విచారించరు. వారి మధ్య బాధ్యతే కాని ప్రేమబంధం లేదు కనుక!

అటువంటి పరిస్థితి ఏ భర్తా తెచ్చుకోకూడదనే నా కోరిక. పెళ్ళి, ప్రేమ, దాంపత్యం అనే మాటలకు అర్థాన్ని మార్చేస్తారు కొంతమంది!

మరికొందరు కొత్త అర్థాన్ని సృష్టించగలరు. ఈ రెండో రకమే జయంతి భర్త. అందుకే ఆమె జీవితం హాయిగా ఉంది. భారతి ప్రేమను దూరగొన్న వ్యక్తి ఎవరో జయంతికి తెలుసు. జయంతి ఊహించగలదనీ భారతికి తెలుసు. ఇప్పుడు వ్యక్తీకరించినందువలన కలిగే ప్రయోజనం ఏమీ లేదు కనుక ఇద్దరూ మనసులోనే దాచుకున్నారు.

ఆ వ్యక్తి జయంతి అన్నయ్య ... రాజశేఖరం!

అప్పటికే అతనికి పెళ్ళయిపోయింది.

అదెలా సాధ్యం అంటే ప్రేమకు తర, తమ భేదం లేదు. పూర్తిగా మానసికమైనది. "ఒక్కో స్త్రీ తన జీవితానుభవంలో అన్నీ అనుభవించిన తర్వాతనే పెళ్ళి చేసుకోకుండా వుండవలసింది" అంటూ విచారిస్తుంది. కాని ఏం లాభం? అది 'స్మశాన వైరాగ్యం' లాంటిది.

విచిత్రం... ముందుగా పెళ్ళి గురించి, భర్త గురించి ఒక స్థిరమైన అభిప్రాయం ఏర్పడనిదే పెళ్ళి చేసుకోరాదని, అందరూ గ్రహిస్తే బాగుండును అనుకుంది జయంతి అమెరికా వైపు సాగిపోతున్న విమానంలో కూర్చుని.

❀

## స్నేహం

నీడనిచ్చు
పళ్ళనిచ్చు
చెట్టులాంటిది స్నేహం!
ఒకరికని
తనదన్నది
వదలుకునేది స్నేహం
అనుబంధాలయి
అలవికానిదని
ఎరుగనిది స్నేహం!
ఒంటరి
ఎడారిలో
ఒయాసిస్సు స్నేహం!
కొరతల
జీవితాన
పెన్నిధి స్నేహం!
అడగకనే
దేవుడు మనిషికి
ఇచ్చిన వరం స్నేహం!

**- తటవర్తి రామచంద్రరావు**